# త్రీ బెడ్రూముల హాలుకిచెన్

-ప్రభాకర్ తల్లాప్రగడ

అప్పారావు ఈమధ్యనే త్రీ బెడ్రూమ్, హాలు, కిచెన్ ఇండిపెండెంట్ హౌస్ కట్టాడు. రెండువేల చదరపు అడుగుల కార్పెట్ ఏరియా, కళ్లు తిరిగే ఇంటీయర్ డెకరేషన్, చుట్టూరా ఎత్తయిన పెద్ద గేటు, కారు పార్కింగ్‌తోపాటు చుట్టూ పచ్చని చెట్లమధ్య అప్పారావు ఇల్లు బయటవాళ్లకు దోబూచులాడుతూ కనబడుతూ ఉంటుంది. ప్రభుత్వానికి సంబంధించిన శాఖలో అతి కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. కాంట్రాక్టర్ల పనులకు, బిల్లులకు సంబంధించిన ఫైల్స్ గురించి అనుకూల సంకేతాలిచ్చే తన క్రింద పని చేసే ఇద్దరు నమ్మకమైన గుమస్తాల సహకారంతో, తను గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఫైల్స్‌మీద సంతకాలు పెట్టే బాస్ అండదండలతో ఏదో కొద్దిగా కూడబెట్టాడు అప్పారావు. ఇదే కంటకింపుగా వుంది మిగతా స్టాఫ్‌కి.

అందుకే ఆఫీసులో స్టాఫ్ ఎవ్వరినీ పిలువకుండా తన క్రింద పని చేసే గుమస్తాలను, తన బాస్‌ని మాత్రమే పిలిచి గృహ ప్రవేశాన్ని గుట్టుగా కానిచ్చేసాడు. వాళ్లు వచ్చినా తనని ఏమని కామెంట్ చేస్తారు? ఎంతైనా వాళ్లమధ్య ఉన్నది మ్యూచువల్ అండర్‌స్టాండింగ్‌కదా. అనక మిగతా స్టాఫ్‌కి ఆఫీసులో లంచ్ పార్టీ ఇచ్చేసి 'హమ్మయ్య' అనుకున్నాడు అప్పారావు. ఒకరోజు బాస్ పిలిచి "అప్పారావు! ఎంతయిందయ్యా మొత్తం ఇంటికి?" అని అడిగాడు.

సూటిగా చెప్పకుండా "బ్యాంకు లోను ఇరవై లక్షలు తీసుకున్న సంగతి మీకు తెలుసుకదా సార్. మిగతా ఇరవై మావాళ్ల దగ్గర అక్కడా ఇక్కడా తీసుకుని మేనేజ్ చేసాను" అన్నాడు అప్పారావు. బాస్ చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వుకు అర్థం అప్పారావుకు తెలుసు. అప్పారావు చెప్పిన ఫిగర్ పచ్చి అబద్ధమని బాస్‌కి తెలుసు. అంతకుపూర్వం రెండేళ్లక్రితం బాస్ జూబ్లీహిల్స్‌లో రెండు కోట్లతో చిన్న కుటీరంలాంటిది కట్టాడు. అప్పుడు బాస్‌ని అడిగినప్పుడు అరవై డెబ్బై లక్షలయిందని చెప్పినప్పుడు అప్పారావు ఇలానే నవ్వాడు. ఇలాంటి విషయంలో ఒకరికొకరు బయటపడరు కదా. ఏమైనా మ్యూచువల్ అండర్‌స్టాండింగ్. ఈ మ్యూచువల్ అండర్‌స్టాండింగ్‌కి అసలైన అర్థం ఏ గవర్నమెంటు ఆఫీసులో అటెండర్ నుంచి ఆఫీసర్‌వరకు ఎవరిని అడిగినా చెబుతారు.

★★★

రాత్రి ఏడయింది. కాలింగ్‌బెల్ మ్రోగగానే తలుపులు తెరిచిన అప్పారావుకి తన ఆఫీసులో పని చేసే సీనియర్ అసిస్టెంట్ రాజు నిండైన క్యారీబ్యాగ్‌తో కనిపించాడు. రాజు తన ఆఫీసులోనే వేరే సెక్షన్‌లో పని చేస్తూ తన సెక్షన్‌కి ఇంటర్నల్ ట్రాన్స్‌ఫర్ మీద నిన్ననే జాయిన్ అయ్యాడు. అతను తనని ప్రసన్నం చేసుకోవడానికి వచ్చాడని అప్పారావు గ్రహించాడు.

"రాజు! రా...రా... ఏమిటి ఇలా వచ్చావు?" అంటూ తలుపులు తీసి లోపలకు ఆహ్వానించాడు. రాజు వినమ్రంగా వంగి వంగి లోపలకు వచ్చి అప్పారావుకి షేక్‌హ్యాండ్ ఇచ్చి తన చేతిలోని నిండైన క్యారీబ్యాగ్‌ను టీపాయ్‌మీద పెట్టాడు. ఆ క్యారీబ్యాగ్ నిండా స్వీట్స్ ఉండడం చూసిన అప్పారావు "ఏమిటోయ్ రాజూ ఇదంతా? ఇవన్నీ ఎందుకు? ఇలాంటివి నాకు నచ్చవని నీకు తెలుసుకదా?" అంటూ ఆ నిండైన క్యారీబ్యాగ్‌ను టీపాయ్ మీద నుంచి తీసి క్రింది అరలో పెట్టాడు.

"అబ్బే... ఏమీలేదు సార్. దేవాలయానికి వెళ్లినా, పెద్దవాళ్ల దగ్గరకు వెళ్లినా రిక్తహస్తాలతో వెళ్లకూడదని స్వర్గంలో వున్న మా అమ్మ చెబుతూ ఉండేది. అందుకే నా తృప్తికొద్దీ" అంటూ నసిగాడు రాజు.

అప్పారావు ముఖం చాటయింది.

"రాజూ! నువ్వు మా ఇల్లు చూడలేదుకదూ. లోపలకు రా చూద్దువుగానీ" అని భుజంమీద చెయ్యేసి మరీ లోపలకు తీసుకువెళ్లాడు.

హాలు, కిచెన్ అంతా చూపించాడు. తన బెడ్రూమ్‌లోకి తీసుకువెళ్లాడు. రాజు ఆ బెడ్రూమ్‌ని తేరిపార చూస్తుంటే "మిగతా రెండు బెడ్రూమ్‌లు ఇలాగే ఉంటాయోయ్" అంటూ హాలులోకి తీసుకుని వచ్చాడు.

"ఎలా వుందోయ్ రాజు మా త్రీ బెడ్రూమ్‌ల హాలు కిచెన్ ఇండిపెండెంట్ హౌస్?" అని అడిగాడు అప్పారావు.

'కోటి రూపాయలు పెట్టి ఇల్లు కడితే బాగుండక చస్తుందా' అని లోపల అనుకున్న మాటలు బయటకు వచ్చేసాయి రాజుకి.

"ఏ మాటన్నావు రాజూ?" అన్న అప్పారావు మాటలకు రాజు తేరుకుని-

"మీ టేస్ట్ సూపర్బ్ అండ్ మార్వలెస్ సార్. ఇంటీరియర్స్ మరీ అదుర్స్" అంటూ పొగిడాడు. అప్పారావు ముఖం హాలులోవున్న ఖరీదైన షాండిలియర్స్‌కన్నా వెలిగిపోయింది.

'అమ్మయ్య! నేను అనుకున్న మాటలు ఈయనకు వినబడలేదు థాంక్‌గాడ్' అనుకున్నాడు లోలోపల రాజు.

హాలులోకి వచ్చి సోఫాలో కూర్చోగానే అప్పారావు "రాజూ! నువ్వు నిన్ననే సెక్షన్‌లో జాయినయ్యావు కదా. మనమందరం కలసి అండర్‌స్టాండింగ్‌తో పని చేసుకోవాలోయ్. ఆ పైవోవర్‌కు సంబంధించిన వర్క్‌ని ఎలాట్ చేయమని సూపరింటెండెంట్‌కి చెబుతాను" అంటూ వరమిచ్చేసాడు అప్పారావు.

"థాంక్స్ సార్. ఇక నేను వెళతాను"

"అదేమిటి! కాఫీ, టీ లాంటివి ఏమీ త్రాగకుండా ఎలా వెళతావు?" అంటూ లోపలకు చూసాడు అప్పారావు. అలాంటి వాతావరణం

కనుచూపుమేరలో ఏమీ కనబడలేదు. అప్పటికే రాత్రి ఎనిమిది అయింది. హరిహరాదులు వచ్చినా ఆ టైములో అప్పారావు భార్య గది నుంచి బయటకు రాదని తెలిసినా ఏదో మాట వరుసకు ఆఫర్ చేయాలికదా అని నోరు జారాడు.


"ఏమీలేదు రాజూ! ఈ టైమ్‌లో తెలుగు సీరియల్స్ చూస్తుంది. అందుకే బిజీగా ఉంది'' అంటూ సంజాయిషీగా చెప్పాడు.

"ఫర్వాలేదులెండి. అయినా మనం హాలులో కూర్చుంటే మేడమ్ సీరియల్స్ ఎలా చూస్తారు?'' అంటూ లేచాడు రాజు.

"ఫర్వాలేదు రాజూ! ఇలాంటి ఇబ్బందులు వస్తాయనే మూడు బెడ్రూమ్స్‌లో మూడు ప్లాస్మా టీవీలు పెట్టేసాను. ఇది గెస్టుల గురించి. అయినా మేమెవ్వరం హాలులో కూర్చుని టీవీ చూడం. మనం టీవీ చూస్తూ కూర్చుంటే గెస్టులకు బాగుండదు, మనకు బాగుండదుకదా. అసలు టీవీ రిమోట్ గురించి దెబ్బలాటలు, వాదనలుండవు. ఎలా వుంది నా అరేంజ్‌మెంట్?'' అంటూ ఏదో ఘనకార్యం చేసినట్లు రాజు ముఖంలోకి చూసాడు అప్పారావు.

"ఫెంటాస్టిక్ ఐడియా సార్'' అంటూ గుమ్మం దగ్గరకు నడిచాడు రాజు.

గుమ్మందాకా వెళ్లి సాగనంపి లోపలకు వచ్చి తలుపేసుకున్నాడు అప్పారావు. హాలులోని వాల్‌క్లాక్‌వైపు చూసిన అప్పారావుకి ఎనిమిదిన్నర కావడం చూసి హడావుడిగా హాలులోని ఫేన్స్, లైట్స్ ఆఫ్ చేసాడు. తనకిష్టమైన ఐపిఎల్ ట్వంటీ ట్వంటీ క్రికెట్ మ్యాచ్ మొదలై అరగంట అయింది. మిగతా రెండు బెడ్రూమ్‌లవైపు చూసాడు. అప్పటికే అప్పారావు భార్య తెలుగు సీరియల్‌లో లీనమైపోయి ఉంటుంది. రెండు మూడు సీరియల్స్, రెండు రియాల్టీ షోలు



చూసి పదిగంటలకు బయటకు వస్తుంది.

రాత్రికి కావాల్సిన వంట కూడా పొద్దునే ఉడకేసి టేబుల్‌మీద పెట్టేస్తుంది. ఇక అప్పారావు కొడుకు కాలేజీ నుంచి రాగానే షూస్ విప్పేసి ఫ్రెష్ అవకుండానే రూములోకి దూరి తలుపేసుకుంటాడు. ఆకలేస్తేనే బయటకు వస్తాడు. సాధ్యమైనంతవరకూ పిజ్జాలు, బర్గర్లు బయట లాగించేసి హైసౌండ్ మ్యూజిక్ వింటూ పూనకం వచ్చినట్లు ఊగిపోతూ ఉంటాడని అప్పారావుకు తెలుసు. కిచెన్‌లో కూడా లైట్స్ తీసేసి ఫ్రిజ్‌లోంచి రెండు వాటర్ బాటిల్స్ తీసుకుని తన రూమ్‌లోకి దూరి క్రికెట్ మ్యాచ్‌లో లీనమయ్యాడు. క్రికెట్ మ్యాచ్ చూస్తుండగా మధ్యమధ్యలో ఏవో చప్పుళ్లు రావడం గ్రహించాడు. అవి తన కొడుకు రూమ్‌లోంచివచ్చే సౌండ్‌సిస్టమ్ నుంచి వచ్చే డ్రమ్స్ చప్పుళ్లగానో లేక తన భార్య చూసే తెలుగు సీరియల్ ఆరువందల డెబ్బై ఎపిసోడ్‌లోని అత్తాకోడళ్ల హావభావాలకు సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్కోనని సరిపెట్టుకున్నాడు మూడు బెడ్రూమ్‌ల హాలు కిచెన్ ఓనర్ అప్పారావు.

పదిగంటల సమయంలో క్రికెట్ మ్యాచ్ ఫస్ట్ సెషన్ అవగానే బయటకు వచ్చాడు అప్పారావు. హాలులో, కిచెన్‌లో లైట్లు వెలుగుతున్నాయి. ఫ్యాన్లు కూడా స్పీడుగా తిరుగుతున్నాయి. హాలులో షాండిలియర్స్ కూడా దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. అప్పారావు మిగతా బెడ్రూమ్‌లవైపు చూసాడు. అవి ఇంకా తెరుచుకోలేదు. ఒకింత ఆశ్చర్యానికి గురై హాలు ముందుకు వచ్చిన అప్పారావు షాకయ్యాడు. హాలులో పెట్టిన ముప్పై తొమ్మిది అంగుళాల ప్లాస్మా టీవీ, డివిడి ప్లేయర్ కనబడలేదు. టీపాయ్ మీద మరచిపోయిన తన బ్లాక్‌బెర్రీ మొబైల్, రాజు తెచ్చిన నిండైన క్యారీ బ్యాగ్ క్రింద అరలో కనబడలేదు. వీధి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. గబగబా తన భార్య, కొడుకుల గది తలుపులు బాదాడు.

ఒక్కసారిగా తలుపులు తెరిచిన అప్పారావు భార్య "ఏమిటండీ ఏమైంది? ఒక్క పదినిముషాలు ఆగలేరా? అయినా పొద్దున్న చేసినవన్నీ డైనింగ్ టేబుల్‌మీద ఉన్నాయికదా. ఓవెన్‌లో పెట్టి వేడి చేసుకుని తినలేరా?" అంటూ హుంకరించింది. హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ఊగిపోతూ తలుపులు తీసిన అప్పారావు కొడుకు కూడా ఇంచుమించు అదే ధోరణిలో చూసాడు. జరగిన సంగతి చెప్పగానే అప్పారావు భార్య ముచ్చటగా మూడులక్షలతో చేయించిన అల్ట్రామోడ్రన్ మాడ్యులర్ కిచెన్‌లోకి పరుగెత్తింది. కిచెన్ క్యాబినెట్ తలుపులు నోళ్లు వెళ్లబెట్టుకుని ఉన్నాయి. వాటిలో వుంచిన వెండి కంచాలు, గ్లాసులు, చెంచాలు ఏమీ కనబడలేదు. అనుమానంతో పూజ రూమ్‌లోకి చూసి అక్కడ చిన్న బాక్స్ కనబడకపోవడంతో "అయ్యో...అయ్యో..." అంటూ హిస్టీరిక్‌గా అయిపోయింది.

రోజూ సాయంత్రం అప్పారావు భార్యకి ఫ్రెష్‌గా తయారై టీవీ సీరియల్స్‌కి రెడీ కావడం అలవాటు. స్నానం చేసేముందు తన నగలను, గాజులను అన్నీ పూజ రూములో చిన్న బాక్స్‌లో వేసి బాత్రూంకి వెళుతుంది. ఆ రోజు సీరియల్ మొదలైందన్న హడావుడిలో వాటిని మరచిపోయింది.

"ఒరేయ్! పోలీసులకు ఫోన్ చేయ్" అంటూ కొడుక్కి చెప్పాడు.

"డాడీ! కాలేజీ నుంచి రాగానే నా లాప్‌టాప్ బ్యాగ్, నా మొబైల్ డైనింగ్ టేబుల్‌మీద పెట్టాను. అవీ కనబడడంలేదు" బిక్కమొహం పెట్టాడు అప్పారావు కొడుకు.

చేసేదిలేక ముందర గదిలో పెద్ద దిక్కుగా పడుండే దుమ్ము కొట్టుకుపోయిన ల్యాండ్‌లైన్ ఫోన్ దగ్గరకు వెళ్లిన అప్పారావుకి అదీ కనబడలేదు. ఇప్పుడిప్పుడే అప్పారావుకి ఏదో లీలగా గోచరిస్తున్నట్లుగా కనబడుతోంది. రాజు వెళ్లగానే తలుపైతే వేసాడుగానీ గడియ పెట్టడం మరచిపోయాడు. అప్పుడప్పుడు తన రూములోకి వచ్చే చప్పుళ్లను అపార్థం చేసుకున్నాడు. ఎత్తుకుని వెళ్లడానికి వీలులేని సోఫా సెట్స్, డైనింగ్ టేబుల్, ఫ్రిజ్‌లాంటివి తప్ప మిగతా చేతికందినవన్నీ గంటలో లైట్లు, ఫ్యాన్లు వేసుకుని మరీ దోచేసారు దొంగలు. చెప్పులైనా వేసుకోకుండా జారిపోతున్న లుంగీని పైకెగదీసుకుంటూ పోలీసులకు ఫోన్ చేద్దామని రోడ్డవతల ఇంట్లోకి పరుగెత్తాడు త్రీ బెడ్రూమ్ హాలు కిచెన్ ఇండిపెండెంట్ హౌస్ ఓనర్ అప్పారావు!

★



## 'అప్పుడేం తొందర?'

"ఈమధ్య నేను ఓ వ్యాపారవేత్తను పెళ్ళాడబోతున్నట్లుగా పత్రికల్లో వార్తలు వచ్చాయి. నాకు తెలియకుండానే నా పెళ్లి వార్తలు వాళ్లకు ఎలా తెలిసిందో నాకు అర్థం కావడంలేదు. ఎవరికీ చెప్పకుండా పెళ్లి చేసుకునే అవసరం నాకు లేదు. అయినా అప్పుడే నా పెళ్లికి తొందరేమొచ్చింది? అదీ గాక మరో పదేళ్లవరకూ పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం కూడా లేదు" అంటోంది నమిత. అవును... నమిత చెప్పింది కూడా నిజమే కదా!

